సాక్షి
వికారాబాద్

శుక్రవారం । 10 । జనవరి । 2025



ఆకాశాన్నంటిన పప్పుల ధర

నిత్యావసరాల్లో ప్రధానమైన పప్పుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. సామాన్యులు విలవిలలాడుతున్నారు.

10లో▸



మైనర్లకు వాహనాలివ్వొద్దు

మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై కేసులు తప్పవని తాండూరు పట్టణ సీఐ సంతోష్ కుమార్ హెచ్చరించారు.

10లో▸



జీపీ ఏర్పాటు కలేనా?

తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయకపోవడంతో స్థానికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు.

11లో▸

న్యూస్‌రీల్

సమష్టి కృషితోనే సంస్థ అభివృద్ధి

ఆర్టీసీ డీఎం అరుణ



ఉద్యోగులను సన్మానిస్తున్న ఆర్టీసీ అధికారులు

అనంతగిరి: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని గురువారం వికారాబాద్‌లోని ఆర్టీసీ డిపోలో మెయింటెనెన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపోలో బస్సులను సకాలంలో మెయింటెనెన్స్ చేస్తూ భద్రతాపరంగా జాగ్రత్తలు తీసుకున్న టీఎస్ రెడ్డికి ఉత్తమ మెకానిక్‌గా, సిబ్బంది ఎ.రాజుకు ఉత్తమ శ్రామిక్‌గా అవార్డులు అందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. డిపో మేనేజర్ అరుణ మాట్లాడుతూ.. బస్సులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా మెరుగైన సేవలు అందించాలని ఆమె కోరారు. సమష్టి కృషితోనే ఆర్టీసీ ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిపో సూపర్‌వైజర్లు, ఉద్యోగులు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చిలుకూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దేవేందర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5వ తరగతి ప్రవేశాలతో పాటు 6, 7, 8, 9వ తరగతుల్లో ఖాళీ సీట్లను భర్తీ చేస్తామన్నారు. గౌలిదొడ్డి ఈఐఎస్, అలుగునూరు సీఓఈ పాఠశాలల్లో 9వ తరగతిలో ప్రవేశాలకు, ఖమ్మం ఈఐఎస్, పరిగి ఎస్‌ఓఈ పాఠశాలల్లో 8వ తరగతిలో ప్రవేశాలకు, ఈఐఎస్ రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజిగిరి ఫైన్ ఆర్ట్స్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశాలకు కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీ వరకు http://tgcet.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. కులం, ఆదాయం, ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్, ఫొటోను దరఖాస్తుకు జతచేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్నవారికి ఫిబ్రవరి 23న పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఒలింపియాడ్‌లో ప్రతిభ చూపాలి

మొయినాబాద్: ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న నిర్వహించే జిల్లా స్థాయి ఇంగ్లిష్ ఒలింపియాడ్, స్పీచ్ పోటీల్లో విద్యార్థులంతా పాల్గొని, తమ ప్రతిభ చాటాలని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అన్నారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మొగులయ్య, ప్రధాన కార్యదర్శి సలోమి స్నేహలత తదితరులతో కలిసి ఒలింపియాడ్, స్పీచ్ పోటీలకు సంబంధించిన కరపత్రాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంగ్లిష్ భాషా నైపుణ్యం పోటీలు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఇలాంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో భయం పోయి ఆత్మవిశ్వాసం పెరుగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వీరప్ప, రజిని, లక్ష్మణ్, బాలాజీ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



భట్టి విక్రమార్కను సత్కరించిన కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. రాష్ట్రంలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల పర్యటనకు వెళ్తున్న ఆయనతో పాటు ఎంపీ మల్లురవికి ఆమనగల్లు పట్టణంలో పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. అందరూ కలిసికట్టుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘనవిజయం సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతోందని చెప్పారు. స్వాగతం పలికిన వారిలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక వాడకు చకచకా అడుగులు

హకీంపేట్, పోలెపల్లి గ్రామాల్లో ముగిసిన అసైన్డ్ భూముల సర్వే

- 422.39 ఎకరాలకు చెందిన 251 మంది పట్టాదార్ల భూమి గుర్తింపు
- మిగిలింది లగచర్ల, రోటిబండతండా, పులిచర్లకుంటతండాలే..
- సంక్రాంతి తర్వాత సర్వేకు రెవెన్యూ అధికారుల నిర్ణయం



దుద్యాల్ మండల కేంద్రం వ్యూ

దుద్యాల్: మండలంలోని హకీంపేట్, పోలెపల్లి, లగచర్ల, రోటిబండతండా, పులిచర్లకుంటతండాల్లో ఫార్మా కంపెనీని రద్దు చేసిన ప్రభుత్వం ఈ ప్రాంతంలో పారిశ్రామిక వాడ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన పనుల్లో రెవెన్యూ అధికారులు వేగం పెంచారు. సంబంధిత భూములను సర్వే చేశారు. ప్రస్తుతం ఇందులోని అసైన్డ్ భూములను గుర్తించే పనిలో ఉన్నారు. హకీంపేట్, పోలెపల్లిలో నిర్వహించిన సర్వే ద్వారా రైతుల భూములను గుర్తించారు. హకీంపేట్‌లోని 252 సర్వే నంబర్‌లో 218 మంది పట్టాదారులకు సంబంధించిన 351 ఎకరాల భూమిని, పోలెపల్లిలోని 67 సర్వే నంబర్‌లో 33 మంది పట్టాదారులకు చెందిన 71.39 ఎకరాల భూమిని గుర్తించారు. ఆయా గ్రామాల్లోని అసైన్డ్ స్థలాల పట్టాదారుల హద్దులు నిర్ధారించారు. లగచర్ల, రోటిబండతండా, పులిచర్లకుంటతండాల్లోని అసైన్డ్ భూములను గుర్తించాల్సి ఉందని చెబుతున్నారు. పైమూడు పల్లెల్లోని 93 మందికి సంబంధించిన 110 ఎకరాల అసైన్డ్ భూమి ఉందని, త్వరలోనే ఆయా గ్రామాల్లో కూడా సర్వే చేస్తామని తహసీల్దార్ కిషన్, డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్‌బాబు తెలిపారు. సర్వే పనులు వేగంగా కదులుతుండటంతో త్వరలోనే ఇక్కడికి కంపెనీలు వస్తాయనే చర్చ సాగుతోంది.

లగచర్లలో రైతులు అంగీకరిస్తారా..?

లగచర్ల, రోటిబండతండా, పులిచర్లకుంటతండా గ్రామాల్లో 110 ఎకరాలకు సంబంధించిన అసైన్డ్ భూముల సర్వే చేపట్టేందుకు రెవెన్యూ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. అయితే సంక్రాంతి తర్వాతే సర్వే చేస్తామని తహసీల్దార్ చెబుతున్నారు. ఆయా గ్రామాల రైతులు పారిశ్రామిక వాడ ఏర్పాటుకు అంగీకరిస్తారా..? మరోసారి అడ్డుకుంటారా..? అనేది సందిగ్ధంగా మారింది. ప్రాణం పోయినా భూములు ఇచ్చేది లేదంటూ ఆయా తండాల గిరిజనులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడం, లగచర్ల దాడి ఘటన అందరికీ తెలిసిందే. అధికారులు ఏంచేసినా.. పోలీసు బందోబస్తుతో రావడం పరిస్థితికి అద్దం పడుతోంది. మరోసారి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



పోలెపల్లిలో సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు(ఫైల్)



రేషన్.. ఆశలు!

- ఆహార భద్రత కార్డుల కోసం అర్హుల ఎదురుచూపు
- కొత్త పేర్ల నమోదు ఎనిమిదేళ్లుగా పెండింగ్
- లబ్ధిదారులకు కొత్తవి అందించే దిశగా ప్రభుత్వం అడుగులు
- కార్యరూపం దాలిస్తే.. 35వేల మందికి లబ్ధి

వికారాబాద్: ఆహార భద్రత కార్డుల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న దరఖాస్తుదారులు, అర్హులకు ప్రభుత్వ ప్రకటన ఊరటనిస్తోంది. ఇందుకు సంబంధించిన విధివిధానాలను మంత్రివర్గ సభ్యులు సూచన ప్రాయంగా విడుదల చేయడంతో ఆశలు రేకెత్తాయి. టీఆర్ఎస్ ప్రభుత్వం కొలువుదీరింది మొదలు కొత్త రేషన్ కార్డులు జారీ చేయలేదు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు దరఖాస్తు చేసుకున్న వారిలో సగం మందికి ఇచ్చి చేతులు దులుపుకొంది. ఉన్న కార్డుల్లో కొత్త సభ్యుల వివరాలు నమోదు చేసే అవకాశం కల్పించలేదు. ఎనిమిదేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ఆహార భద్రత పథకంలో భాగంగా లబ్ధిదారులను ఎంపిక చేసింది. కుటుంబంలో ఎంత మంది ఉన్నారో వివరాలు చేర్చారు. అనంతరం ఆయా కుటుంబాల్లో అదనంగా చాలా మంది వచ్చి చేరారు. ఇందులో కొందరు వివాహం చేసుకుని అత్తవారింటికి వచ్చిన వారు, ఎనిమిదేళ్ల కాలంలో జన్మించిన పిల్లలు ఉన్నారు. దీనికి తోడు సాంకేతిక సమస్య కారణంగా కొత్త వారి పేర్లు తొలగించబడ్డాయి. మృతి చెందిన వారి పేర్లను వెంటనే కార్డుల నుంచి తొలగిస్తున్న అధికారులు.. కొత్తవారి వివరాలు నమోదు చేయడంలో మాత్రం పెద్దగా స్పందించడం లేదు.

వేలాది దరఖాస్తులు పెండింగ్

ఎనిమిదేళ్ల క్రితం రేషన్ లబ్ధిదారులను ఎంపిక చేసిన ప్రభుత్వం, ఈ జాబితాను ఆన్‌లైన్‌లో ఉంచింది. వీరికి కొత్త కార్డులు ఇవ్వకుండా, ఏడాదికి సరిపడా కూపన్లు అందజేసింది. అనంతరం పూర్తి స్థాయిలో బయోమెట్రిక్ అమలు చేస్తోంది. కానీ కొత్త సభ్యుల చేరిక అంశాన్ని పట్టించుకోవడం లేదు. ఇలా ఎదురు చూస్తున్నవారిలో జిల్లా నుంచి సుమారు 35,000 మంది ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ప్రజాపాలన పేరుతో దరఖాస్తులు తీసుకోగా, ఇందులో ఆరు గ్యారంటీలకు సంబంధించి 39 వేల దరఖాస్తులు అందాయి. ఇందులో మెజార్టీ అప్లికేషన్లు రేషన్ కార్డులకు సంబంధించినవే కావడం గమనార్హం.

జిల్లాలో 2,41,622 కార్డులు

జిల్లాలోని 588 చౌకధరల దుకాణాల ద్వారా 2,41,622 ఆహార భద్రతా కార్డులకు రేషన్ పంపిణీ చేస్తున్నారు. వీటిలో 2,08,162 ఫుడ్ సేఫ్టీ, 26,730 అంత్యోదయ, 39 అన్నపూర్ణ కార్డులు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి నెల 4,673 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నారు.

ఉత్తీర్ణత పెంచాలి

- ఇంటర్ బోర్డు జిల్లా అధికారి శంకర్‌నాయక్
- తుంకుల్‌గడ్డ కళాశాలలో అధ్యాపకులతో సమావేశం



అధ్యాపకులతో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

పరిగి: ఇంటర్మీడియేట్ ఫలితాలపై దృష్టి సారించాలని ఇంటర్ బోర్డు జిల్లా నోడల్ అధికారి శంకర్‌నాయక్ అధ్యాపకులకు సూచించారు. గురువారం పట్టణ కేంద్రంలోని తుంకుల్‌గడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షలు సమీపిస్తున్నాయని అందుకు విద్యార్థులను మానసికంగా, భౌతికంగా సిద్ధం చేయాలని తెలిపారు. జిల్లాలో ఇంటర్ ఉత్తీర్ణత శాతం నిరాశాజనకంగా ఉంటోందని, ఈ పరిస్థితిలో మార్పు రావాలని ఆదేశించారు. పర్యావరణ విద్య, ఆంగ్లం, సైన్స్ సబ్జెక్టుల ప్రాక్టికల్స్ నిర్వహించాలన్నారు. 20 రోజుల ప్రత్యేక ప్రణాళికతో పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేయాలన్నారు. ఈ బాధ్యతను ఆయా సబ్జెక్ట్ అధ్యాపకులు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, అధ్యాపకులు భాస్కరయోగి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ పహారాలో గ్రీన్ ఫీల్డ్ సర్వే



కుర్మిద్దలో పోలీస్ బందోబస్తు మధ్య మార్కింగ్ వేస్తున్న సిబ్బంది

యాచారం: కుర్మిద్ద గ్రామ రెవెన్యూ పరిధిలోంచి వెళ్లే గ్రీన్ ఫీల్డ్ రోడ్డు సర్వే గురువారం పోలీస్ బందోబస్తు మధ్య జరిగింది. కొంగర్‌కలాన్ ఓఆర్ఆర్ నుంచి ఇబ్రహీంపట్నం, కందుకూరు, యాచారం, కడ్తాల్, ఆమనగల్లు మండలాల్లో నిర్మించే 330 అడుగుల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు సర్వేను కొద్ది రోజులుగా టీజీఐఐసీ, రెవెన్యూ అధికారులు ముమ్మరంగా చేపట్టారు. అందులో భాగంగానే యాచారం మండలం కుర్మిద్ద గ్రామ రెవెన్యూ పరిధిలోని పట్టా భూములు సర్వే నంబర్ 284, 285, 286, 287లతో పాటు అసైన్డ్ భూమి సర్వే నంబర్ 311 నుంచి 330 అడుగుల గ్రీన్ ఫీల్డ్ రోడ్డును నిర్మించడానికి అధికారులు సర్వే చేసి మార్కింగ్ వేశారు. రైతులు అడ్డుకుంటారనే ముందస్తు సమాచారంతో ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు ఆధ్వర్యంలో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ, యాచారం పీఎస్‌ల సీఐలు లిక్కి కృష్ణంరాజు, నర్సింహారావు పర్యవేక్షణలో పెద్ద సంఖ్యలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. స్థానిక రైతులు సర్వేను అడ్డుకోవడానికి ప్రయత్నించగా ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి, ఏసీపీ కేపీవీ రాజు వారికి నచ్చజెప్పారు. ఏమైనా సమస్యలుంటే వినతిపత్రాలు ఇవ్వాలని, సర్వేను అడ్డుకోవద్దని స్పష్టం చేశారు. దీంతో రైతులు ఆర్డీఓ అనంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సర్వే ప్రశాంతంగా కొనసాగింది. కార్యక్రమంలో యాచారం తహసీల్దార్ అయ్యప్ప, పలువురు రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ఫలితాలు సాధించాలి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి



విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్

తుర్కయంజాల్: ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో చదివిన ఎందరో మేధావులు, రాజకీయ వేత్తలు, అధికారులుగా ఉన్నత స్థానాలకు ఎదిగిన వారు ఉన్నారని.. విద్యార్థులు వారిని ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సూచించారు. గురువారం ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజనల్ సిబ్బంది ఏర్పాటు చేసిన షెడ్యూల్ కులాల వసతి గృహ విద్యార్థుల దుప్పట్లు, పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు ఎదగాలంటే చదువు, నిబద్ధత కలిగి ఉండాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. రెవెన్యూ సిబ్బంది ముందుకు వచ్చి విద్యార్థులకు సాయం చేయడం అభినందించదగ్గ విషయమని కొనియాడారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత రెడ్డి, ఎమ్మార్వోలు సునీతా రెడ్డి, ఎం.వి.ప్రసాద్ రావు, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి, హాస్టల్ స్పెషల్ ఆఫీసర్, డీఎల్‌పీఓ సాధన, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ ఆఫీసర్ కుసుమల లావణ్య తదితరులు పాల్గొన్నారు.

'గుట్ట'కాయ స్వాహా!

- అటవీ భూమిలో భారీ తవ్వకాలు
- రెండు గుట్టలు మాయం
- రోడ్డు పనులకు టిప్పర్లతో మట్టి తరలింపు
- రెండెకరాల్లో చెట్లు నేల మట్టం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



గొట్టిగ రిజర్వ్ ఫారెస్టులో మట్టి తవ్వకాలు

బషీరాబాద్: అభివృద్ధి పేరిట అటవీ భూమికి ఎసరు పెట్టారు. ఏకంగా 2 ఎకరాల రిజర్వు ఫారెస్టులో వేలాది చెట్లను నేలమట్టం చేశారు. భారీ ప్రొక్లెయినర్‌లతో రాత్రివేళ ఇరవై రోజులుగా గుట్టు చప్పుడు కాకుండా రెండు గుట్టలను మాయం చేశారు. ఈ ఘటన మండలంలోని గొట్టిగ రిజర్వ్ ఫారెస్టు బ్లాక్‌లో వెలుగు చూసింది. గొట్టిగఖుర్దు నుంచి కొడంగల్ నియోజకవర్గంలోని అంగడిరైచూర్ వరకు ప్రభుత్వం డబుల్ రోడ్డు పనులు ప్రారంభించింది. ఈ పనులు చేస్తున్న సదరు గుత్తేదారు రోడ్డు నిర్మాణానికి పక్కనే ఉన్న గొట్టిగ రిజర్వ్ ఫారెస్టులోని రెండెకరాల విస్తీర్ణంలో ఉన్న గుట్టలపై చెట్లను నేల మట్టం చేశారు. పెద్ద పెద్ద ప్రొక్లెయినర్లతో సుమారు 50 ఫీట్ల ఎత్తున్న గుట్టల నుంచి మట్టిని తవ్వి 10 కిలోమీటర్ల వరకు రోడ్డు వేస్తున్నారు. అయితే పక్కనే ప్రభుత్వ అసైన్డ్ భూములు ఉన్నా అందులో మట్టి తీయడానికి రైతులు విముఖత వ్యక్తం చేయడంతో ఫారెస్టు భూమిలో భారీ తవ్వకాలు చేపట్టారు.

అభివృద్ధి పేరిట అడవికి ఎసరు!

అభివృద్ధి పనుల కోసం అటవీ భూములకు ఎసరు పెట్టడంపై సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్డుకు మట్టి అవసరమైతే అసైన్డ్ భూముల్లో తవ్వకాలకు స్థానిక తహసీల్దార్ ద్వారా అనుమతి తీసుకోవచ్చు. కానీ రిజర్వు ఫారెస్టు చట్టాలు చాలా కఠినంగా ఉంటాయి. చిన్న చెట్టును నరికినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. అలాంటిది 2 ఎకరాల భూమిలో వేలాది చెట్లు నేల మట్టం చేసినా ఫారెస్టు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

చట్టాలేం చెబుతున్నాయి?

రిజర్వ్ ఫారెస్టులో మైనింగ్ చేయడం నిషేధం. ఎవరైనా మట్టి తవ్వకాలు చేసినా, ఇతర విలువైన వనరుల వెలికితీత కోసం తవ్వకాలు జరిపినా వారిపై అటవీ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారు. అటవీలో చెట్లు నరికితే ఎఫ్ఎస్ఆర్ ప్రకారం ఒక్కో చెట్టుకు కనిష్ఠంగా రూ.2వేల వరకు జరిమానా విధిస్తారు. రోడ్ల విస్తరణకు అటవీ భూములు ఎక్కువ మొత్తంలో కోల్పోతే రాష్ట్ర ప్రభుత్వం అంతే భూమిని ఆ శాఖకు కేటాయించి మొక్కలు నాటించాల్సి ఉంటుందని అటవీ చట్టాలు చెబుతున్నాయి. మరీ ఇంతా భారీ మొత్తంలో మొక్కలు నరికి వందల క్యూబిక్ మీటర్లలో మట్టి తవ్వకాలు జరిపిన సదరు గుత్తేదారుపై చర్యలు లేవు.

మీదంటే.. మీదే..!

ఇదిలా ఉండగా అటవీ భూములను పరిరక్షించాల్సిన ఆ శాఖ అధికారులు 20 రోజులుగా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. గుత్తేదారు తవ్వకాలు జరిపిన భూమి ఫారెస్టు భూమినా..? రెవెన్యూ భూమినా అనే తేల్చలేకపోతున్నామని ఎఫ్ఆర్ఓ శ్రీదేవి సరస్వతి చెప్పడం గమనార్హం. మట్టి తవ్వకాలు చేపట్టిన భూమి స్పష్టంగా రిజర్వ్ ఫారెస్టు భూములుగా గతంలో గుర్తించిన అటవీ అధికారులు.. రాజకీయ ఒత్తిళ్లతో ఈ వ్యవహారం నుంచి బయట పడడానికి ఆపసోపాలు పడుతున్నారు. ఫారెస్టు భూముల పక్కనే ప్రభుత్వ అసైన్డ్ భూములు ఉన్నాయని, తవ్వకాలు జరిపిన భూమి కూడా అసైన్డ్ భూమి అయ్యుండొచ్చని రెవెన్యూ అధికారులకు తెలిపారు. అయితే రికార్డులను పరిశీలించిన తహసీల్దార్ వెంకటేశం సదరు భూములు తమవి కావని తేల్చి చెప్పారు.



మట్టి తీస్తున్న ప్రొక్లెయినర్

ఉన్నతాధికారులకు నివేదించాం

గొట్టిగ రిజర్వ్ ఫారెస్టులో నుంచి రాష్ట్ర ప్రభుత్వం వేస్తున్నా రోడ్డుకు మట్టి తవ్వకాలు జరిపింది వాస్తవమే. అయితే భూముల సరిహద్దుల విషయంలో కొంత గందరగోళం ఉంది. ఇప్పటికే మట్టిని తరలిస్తున్న ఓ టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశాం. మట్టి తవ్వకాలు, చెట్ల నరికివేతపై మా చేతుల్లో ఏమీ లేదు. చర్యల నిమిత్తం జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తాం.

– శ్రీదేవిసరస్వతి, ఎఫ్ఆర్ఓ, తాండూరు

విధి నిర్వహణలో అలసత్వం సహించం

జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్



సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ సురేష్ మోహన్

షాద్‌నగర్: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్ హెచ్చరించారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం గ్రామాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పల్లె ప్రకృతి వనం, సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రం, డంపింగ్ యార్డును పరిశీలించారు. పల్లె ప్రకృతి వనంలో సరైన నిర్వహణ లేక పిచ్చి మొక్కలు మొలవడం.. డంపింగ్ యార్డు ఆవరణలో విచ్చలవిడిగా చెత్తను పారబోయడంతో పరిసరాల్లో కాలుష్యం అవుతుండడం.. సేంద్రియ ఎరువుల తయారీ షెడ్డు వాడుకలో లేకపోవడాన్ని గమనించి పంచాయతీ కార్యదర్శి జగదీశ్వర్‌పై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం డీపీఓ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. గ్రామస్తుల నుంచి వసూలు చేసిన రూ.19,547 పన్నులను ట్రెజరీలో డిపాజిట్ చేయకుండా తన దగ్గర ఉంచుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే షోకాజ్ నోటీసు జారీ చేశారు. తనిఖీల్లో ఎంపీడీఓ బన్సీలాల్, ఎంపీఓ జయంత్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెట్రోల్ పంపు ఏర్పాటు చేయాలని వినతి

ధారూరు: మండల పరిధిలోని నాగారంలో పెట్రోల్ పంపు ఏర్పాటు చేయించాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కేంద్ర పెట్రోలియం , సహజ వనరులశాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి గురువారం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మెయిల్ ద్వారా వినతిపత్రం పంపారని ధారూరు పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. గతంలో నాగారంలో పెట్రోల్ పంపు ఏర్పాటు చేయాలని సత్యనారాయణరెడ్డి ఎంపీకి విన్నవించారు. దీంతో స్పందించిన విశ్వేశ్వర్‌రెడ్డి కేంద్రమంత్రికి లేఖ రాశారు. నాగారం పరిధిలో 15 కిలో మీటర్ల మేర పెట్రోల్ పంపు లేకపోవడంతో దాదాపు 15 గ్రామాలకు చెందిన వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబహదూర్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తపస్ నేతలు

దోమ: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తపస్(తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం) అనునిత్యం కృషి చేస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర బహదూర్ అన్నారు. గురువారం పరిగి పట్టణంలోని తపస్ కార్యాలయంలో సంఘ నేతలు ఎంఈఓ వెంకట్‌తో కలిసి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేలా తపస్ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా బాధ్యులు వెంకటేశం, లక్ష్మణ్, బుచ్చిలింగం, చంద్రమౌళి, గోపాల్, శ్రీనివాస్, నవీన్, నాయకులు రామాంజనేయులు, నరేందర్‌రెడ్డి, వెంకటేష్, రాజశేఖర్, పృథ్వీ, మోహన్ పాల్గొన్నారు.

గిరిజనుల ప్రాజెక్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతగిరి: కేంద్ర గిరిజన వ్యవహారాలు, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఏడాదికిగాను ప్రభుత్వేతర ఎన్‌జీఓ లేదా గిరిజనుల ఉన్నతి కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల నుంచి నూతన ప్రాజెక్టుల కోసం ఆన్‌లైన్లో దరఖాస్తులు కోరుతున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 15వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత కలిగిన ప్రభుత్వేతర ఎన్‌జీఓ, గిరిజనుల ఉన్నతి కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల వారు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

విహారయాత్రలో విషాదం

వేవ్ పూల్‌లో పడి విద్యార్థి దుర్మరణం



ఫైజాన్ మృతదేహం

శంకర్‌పల్లి: విహార యాత్రలో విషాదం చోటు చేసుకుంది. అప్పటి వరకు అందరితో పాటు అల్లరి చేస్తూ ఆడుకుంటున్న బాలుడు.. ఒక్కసారిగా కుప్పకూలి విగత జీవిగా మారాడు. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ శాలిబండకు చెందిన గులాం రసూల్ అన్సారీ, రఫియా దంపతుల కుమారుడు ఫైజాన్(12), జహనుమా (బహదుర్‌పురా సమీపం)లోని మదీనా మిషన్ హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. గురువారం పాఠశాల యాజమాన్యం 65మంది విద్యార్థులను ఒక రోజు విహారయాత్ర నిమిత్తం శంకర్‌పల్లి మండలం వైల్డ్ వాటర్స్(ఫామ్ ఎక్స్‌టికా)కి తీసుకెళ్లారు. మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో వేవ్ పూల్‌లో ఆడుకుంటున్నారు. ఆ సమయంలో ఫైజాన్ ఊపిరి ఆడక కింద పడిపోయాడు. దీంతో అక్కడి వారు హుటాహుటినా శంకర్‌పల్లిలోని లైఫ్ కేర్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

ఆకాశాన్నంటిన పప్పుల ధరలు

మాంసకృతులు సమృద్ధిగా ఉన్న వంటకంలో పప్పు దినుసులు ముందువరుసలో నిలుస్తాయి. భోజనంలో కాస్త పప్పు తినాలని అందరూ కోరుకుంటారు. ఇప్పుడా ఆశకు చిల్లు పడే ఆస్కారం ఏర్పడింది. పెరిగిన ధరలతో పప్పు సామాన్యుడికి దూరమవుతోంది.

రూ.180కి చేరిన కంది పప్పు

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న సామాన్యులు



పప్పుల ధరలు ఇలా.. (కిలో)

కంది	రూ.180
పెసర	రూ.120
శనగ	రూ.100
మినపప్పు	రూ.140
బొబ్బెరపప్పు	రూ.80

దౌల్తాబాద్: నిత్యావసరాల్లో ప్రధానమైనవి పప్పు దినుసులు. కొంతమందికి ప్రతి రోజు పప్పుకూర లేనిదే నోట్లోకి ముద్ద దిగదు. అలాంటిది ప్రస్తుతం పప్పుల ధరలు భారీగా పెరగడంతో పప్పన్నం తినాలంటే ప్రజలు వెనుకంజ వేసే పరిస్థితి నెలకొంది. గతంలో దేశవ్యాప్తంగా పప్పుదినుసుల ఉత్పత్తులు పెరగడంతో ధరలు తక్కువగా ఉండేవి. ప్రస్తుతం పప్పుదినుసుల ధరలు చుక్కలంటుతున్నాయి. మార్కెట్లో కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్న తరుణంలో పప్పుదినుసుల ధరలు సైతం పెరగడంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. సమతుల భోజనానికి అవస్థలు పడాల్సి వస్తుందని వాపోతున్నారు.

రోజంతా కూలీ చేసినా..

ప్రస్తుతం పప్పు దినుసుల ధరలు అమాంతంగా పెరగడంతో ప్రజలు కొనుగోళ్లు చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెరిగిన పప్పుల ధరలతో పేద, మధ్య తరగతి కుటుంబాల్లో పప్పు లేకుండానే భోజనం చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. రోజంతా కూలీ చేసినా కూడా కిలో పప్పు కొనలేకపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ఈ సీజన్‌లో కూరగాయాల ధరలు తక్కువగా ఉండాలి. కానీ ప్రస్తుతం ధరలు మండుతున్నాయి. ఉల్లిగడ్డ ధరలు పెరగడంతో పాటు ఇతర కూరగాయాల ధరలు పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నియంత్రణేది?

ప్రస్తుతం పప్పు దినుసుల ధరలు భారీగా పెరగడంతో కొనడానికి ప్రజలు ముందుకు రావడం లేదని వ్యాపారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం మార్కెట్లో పప్పుల అమ్మకాలు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. పప్పుల ధరలు అమాంతంగా పెరిగినా వాటి నియంత్రణలో అధికార యంత్రాంగం విఫలమైందని ఆరోపిస్తున్నారు. పప్పుల ధరలు నియంత్రించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. తక్కువ వేతనం ఆర్జిస్తున్న శ్రమ జీవులకు పప్పు ధరలు చుక్కలు చూపిస్తున్నాయి.

ధరలు తగ్గించాలి



ప్రతి ఏడాది పప్పుల ధరలు పెరుగుతున్నాయి. దీంతో పేద ప్రజలు చేసిన సంపాదనంతా పప్పు, ఉప్పులకే వెచ్చిస్తున్నారు. పప్పు దినుసుల ధరలు అమాంతంగా పెరగడంతో ఇబ్బంది పడుతున్నారు. కొత్త ప్రభుత్వం రేషన్‌షాపుల్లో పప్పులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– వెంకటయ్య, దౌల్తాబాద్



పరిగి: మెకానిక్‌లను సన్మానిస్తున్న ఎస్సై, డీఎం తదితరులు



తాండూరు టౌన్: పోలీసులు స్వాధీనం చేసుకున్న బైకులు

మైనర్లకు వాహనాలిస్తే చర్యలు

తాండూరు పట్టణ సీఐ సంతోష్ కుమార్

తాండూరు టౌన్: మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై కేసులు తప్పవని పట్టణ సీఐ సంతోష్ కుమార్ హెచ్చరించారు. ఈ నెల ఒకటి నుంచి 31వ తేదీ వరకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగా ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే, మైనర్లు వాహనాలు నడిపితే, లైసెన్సు లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ మేరకు గురువారం పట్టణంలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో పలువురు పాఠశాల, కళాశాలలకు చెందిన మైనర్లు నడుపుతున్న 15 వాహనాలను అదుపులోకి తీసుకున్నామన్నారు. మైనర్లతో పాటు బైకు యజమానిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఉద్యోగుల కృషి అవసరం

పరిగి: సంస్థ అభ్యున్నతికి ఉద్యోగుల కృషి ఎంతో అవసరమని పరిగి ఎస్సై సంతోష్‌కుమార్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ ఆధ్వర్యంలో గురువారం మెయింటెనెన్స్ డే సందర్భంగా ఉత్తమ మెకానిక్‌లను సత్కరించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. మంచి ఆర్టీసీ బస్సులను డ్రైవర్లకు అప్పజెప్పే బాధ్యత మెకానిక్‌లపైనే ఉంటుందన్నారు. ఉద్యోగులందరూ పట్టుదలతో పనిచేసి సంస్థ ఉన్నతికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎం కరుణశ్రీ, కుల్కచర్ల ఎస్సై తదితరులు పాల్గొన్నారు.

ఇసుక వాగుల వద్ద నిఘా

తాండూరు రూరల్: మండలంలో గోనూర్, వీర్‌శెట్టిపల్లి, నారాయణపూర్ గ్రామాల సమీపంలో ఉన్న కాగ్నానది(వాగు) నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం కానిస్టేబుళ్లను గ్రామాల వాగుల పరిశీలనకు పంపించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారుల పర్మిషన్ ఉంటేనే ఇసుక తరలించాలన్నారు. ఎవరైనా అక్రమంగా తరలిస్తే 87126 70052కు ఫిర్యాదు చేయాలని ఎస్ఐ సూచించారు.

శభాష్ సాయిలు

రోడ్డుపై దొరికిన ల్యాప్‌టాప్‌ను బాధితుడికి అప్పగింత



ల్యాప్‌టాప్ బ్యాగును నర్సింహులుకు అందిస్తున్న సాయిలు

యాలాల: రోడ్డుపై దొరికిన ల్యాప్‌టాప్, ఐరీష్ సెట్, వెబ్ కెమెరాను బాధితుడికి అప్పగించి నిజాయతీ చాటుకున్నాడో ఓ వ్యక్తి. ఈ సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని హాజీపూర్ గ్రామానికి చెందిన నర్సింహులు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ ప్రక్రియను చేస్తుంటాడు. బుధవారం ఆయన జుంటుపల్లి పాఠశాలలో ఆధార్ నవీకరించిన తర్వాత సాయంత్రం బైక్‌పై ల్యాప్‌టాప్, ఐరీష్‌సెట్, వెబ్ కెమెరాను బ్యాగులో పెట్టుకొని స్వగ్రామానికి వస్తున్నాడు. ఇంటికి చేరుకున్నాక చూడగా బ్యాగ్ కనిపించలేదు. వెంటనే వచ్చిన మార్గంలో రాత్రివేళ బ్యాగ్ కోసం వెతికినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. గురువారం ఉదయం యాలాల పీఎస్‌లో ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైన నర్సింహులుకు హాజీపూర్ గ్రామానికి చెందిన పోతుల సాయిలు ఫోన్ చేసి బ్యాగ్ తనకు రోడ్డుపై దొరికిందని సమాచారం ఇచ్చాడు. బ్యాగ్‌లో ఉన్న ఐడీ కార్డుతో పాటు రూ.లక్ష విలువైన వస్తువులను భద్రంగా తిరిగి తనకు అప్పగించడం పట్ల నర్సింహులు సంతోషం వ్యక్తం చేశాడు. సాయిలు నిజాయతీని గ్రామస్తులు అభినందించారు.

ఓవర్‌లోడ్‌తో లారీలో మట్టి తరలింపు

తాండూరు రూరల్: మండలంలో ఓవర్‌లోడ్‌తో మట్టిని తరలిస్తున్న లారీని పట్టుకొని కేసు నమోదు చేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గౌతపూర్ సమీపంలో మట్టి నింపుకొని ఓవర్ లోడ్‌తో టిప్పర్ వెళుతుంది. ఈ క్రమంలో కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తన సిబ్బందితో లారీని పట్టుకొని స్టేషన్‌ను తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



బుగ్గప్ప మృతదేహం

కొడంగల్ రూరల్: బైక్, లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం ఉదయం పట్టణంలో చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని లాహోటి కాలనీ సమీపంలో నివాసముంటున్న బుగ్గప్ప(50) ఇంటి నుంచి ఉదయం వ్యక్తిగత పని నిమిత్తం అంబేడ్కర్ చౌరస్తాకు బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో రావులపల్లి నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ లాహోటి కమాన్ సమీపంలో మలుపు దగ్గర బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బుగ్గప్ప అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య శేఖరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

భర్తను చంపిన భార్యకు రిమాండ్

ఇబ్రహీంపట్నం రూరల్: భర్తను చంపిన భార్యను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం చెందిన షణ్ముఖరావును తాగినమైకంలో హత్య చేసిన భార్య ఉమాపతిని శ్రీగురువారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

ముక్కోటి ఏకాదశికి సర్వం సిద్ధం



మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దేవాలయం

అనంతగిరి: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం వికారాబాద్ పట్టణం, మండల పరిధిలో వైష్ణవ ఆలయాలు ముస్తాబయ్యాయి. ఉత్తర ద్వార దర్శనానికి భక్తుల కోసం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల నుంచే ఉత్తర ద్వారాలకు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేపట్టనున్నారు. వైకుంఠ ఏకాదశి రోజు భక్తులు ఉపవాస దీక్షలతో వచ్చి స్వామిని కొలువనున్నారు. పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం, రామమందిరం, అనంతగిరిగుట్టలో అనంతపద్మనాభ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలకు సిద్ధం చేస్తున్నారు. స్వామి దర్శనం కోసం వికారాబాద్ ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది.

చిలుకూరులో ఏర్పాట్లు

మొయినాబాద్: వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం చిలుకూరు బాలాజీ దేవాలయానికి భారీగా భక్తులు తరలిరానున్నారు. ఇక్కడి ఆలయానికి వైకుంఠ ద్వారం లేకున్నా ఏటా వైకుంఠ ఏకాదశి రోజు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఈసారి కూడా అదే స్థాయిలో వచ్చే అవకాశం ఉండడంతో వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అర్చకుడు రంగరాజన్ తెలిపారు. ధనుర్మాసం, వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారికి విశిష్ట పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు

- 25 మంది అరెస్టు, రూ.3.81 లక్షలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ నారాయణరెడ్డి



అనంతగిరి: జిల్లాలో పేకాట స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు కొరడా ఝళిపించారని ఎస్పీ నారాయణరెడ్డి గురువారం తెలిపారు. నవాబుపేట, బషీరాబాద్ పీఎస్ పరిధిలలో జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి 25 మందిని అదుపులోకి తీసుకున్నారు. దాదాపు రూ.3.81 లక్షలు, 27 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. ఎస్పీ వెల్లడించిన వివరాల ప్రకారం.. టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి సీఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో నవాబుపేట పరిధిలోని గంగ్యాడ గ్రామ శివారులో ఉన్న ఓ ఫాంహౌస్‌లో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారంతో దాడి చేసి 20 మందికి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి దాదాపు రూ.3.26 లక్షలు, 22 సెల్ ఫోన్లు, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయంపై నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అలాగే బషీరాబాద్ మండలం నవాల్గ గ్రామంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో స్థావరంపై దాడులు నిర్వహించి ఐదుగురిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.50 వేలు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు స్థానిక పీఎస్‌లో కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎక్కడైనా పేకాట ఆడిన, ఇసుక, పీడీఎస్ రైస్ అక్రమ రవాణాలు చేసిన, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఏమైనా సమాచారం ఉంటే జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ ఆంజనేయులు 8712670022లో సంప్రదించాలన్నారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయురాలికి డాక్టరేట్



డాక్టరేట్ సాధించిన జ్యోతిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

కందుకూరు: మండలంలోని నేదునూరు పరిధిలోని మోడల్ స్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్న ధరావత్ జ్యోతి తెలుగు సాహిత్యంలో డాక్టరేట్(పీహెచ్‌డీ పట్టా) సాధించారు. ఓరియంటల్ డిపార్ట్‌మెంట్ డీన్, తెలంగాణ సారస్వత పరిషత్ ప్రాచ్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అజ్మీరా సిల్మానాయక్ పర్యవేక్షణలో నాగర్ కర్నూల్ జిల్లా 'బంజారా మౌఖిక సాహిత్యం–పరిశీలన' అంశంపై పరిశోధనలు చేసి ఓయూలోని తెలుగు శాఖకు తన సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. ఇందుకుగాను డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గురువారం మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ విష్ణుప్రియతో పాటు ఉపాధ్యాయులు జ్యోతిని ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో యువజనోత్సవాలు



ముగ్గుల పోటీలో పాల్గొన్న విద్యార్థినులు

అనంతగిరి: ఏబీవీపీ రాష్ట్రీయ కళామంచ్ వికారాబాద్ ఆధ్వర్యంలో పట్టణంలో యువజనోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు రంగోలి, జానపద గేయాలు, సాంస్కృతిక కార్యక్రమాల పోటీలు చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ కళామంచ్ రాష్ట్ర కన్వీనర్ మల్లేశం మాట్లాడుతూ.. స్వామిజీ వివేకనందా జీవితం అందరికీ ఆదర్శమన్నారు. యువత అనుకుంటే సాధించలేనిది లేదన్నారు. ఆయన ఇచ్చిన స్ఫూర్తితోనే ప్రపంచంలో ఎంతో మంది మేధావులు ముందుకు సాగుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ హరీష్‌రావు, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, ఉపాధ్యక్షుడు దయాకర్, జాయింట్ సెక్రటరీ సాయితేజ, రామకృష్ణ, ప్రవీణ్, తులసి, రామ్, అనిల్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అత్తే హతమార్చింది

కోడల్ని చంపి.. అనుమానం రాకుండా నటించి..

- మట్టికుప్పల కింద కూరుకుపోయిన మృతదేహం
- శంషాబాద్ మండలం సాతంరాయిలో ఘటన
- రెండు నెలల తర్వాత వెలుగు చూసిన దారుణం



మట్టి దిబ్బల కింద నుంచి డోలి మృతదేహాన్ని వెలికి తీస్తున్న జేసీబీ   హతురాలు డోలి (ఫైల్)

శంషాబాద్ రూరల్: అత్త చేతిలో కోడలు దారుణ హత్యకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు, హతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ మండలం రామంజాపూర్ తండాకు చెందిన ముడావత్ సూర్య అలియాస్ సురేష్‌కు, అదే తండాకు చెందిన డోలి (40)తో ఇరవై ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. సురేష్ డీసీఎం వాహన డ్రైవర్‌గా పని చేస్తుండగా.. డోలి కూలీ పని చేస్తుండేది. సురేష్ తల్లిదండ్రులు తులసి, అనంతి కొన్నేళ్ల నుంచి సాతంరాయి వద్ద ఉన్న వ్యవసాయ క్షేత్రంలో పని చేస్తూ అక్కడే నివాసముంటున్నారు. సురేష్ చిన్నకొడుకు మనోహర్ వీరి వద్దనే ఉండేవాడు. సురేష్ దంపతులు, పెద్ద కొడుకుతో కలిసి రామంజాపూర్ తండాలో నివసిస్తున్నారు. సురేష్ తరచూ మద్యం తాగి వచ్చి భార్యతో గొడవపడేవాడు. ఈ క్రమంలో గత నవంబర్ 10న డోలి అదృశ్యమైంది. అదే నెల 14న శంషాబాద్ పోలీసులకు భర్త ఫిర్యాదు చేశాడు.

అత్త వద్దకు వెళ్లి..

భర్తతో గొడవ పడిన డోలి సాతంరాయిలో ఉన్న అత్తామామల వద్దకు వెళ్లింది. అదే రోజు రాత్రి వ్యవసాయ క్షేత్రానికి ఎదురుగా ఉన్న నిర్మానుష్య ప్రదేశానికి బెంగళూరు జాతీయ రహదారి దాటి ఇద్దరు వెళ్లారు. అక్కడ ఇద్దరు కలిసి కల్లు తాగారు. మత్తులో ఉన్న డోలిని హత్య చేసిన తులసి అక్కడి నుంచి ఏమీ తెలియనట్లు ఇంటికి వెళ్లింది. తర్వాత కోడలి కోసం కుటుంబ సభ్యులతో కలిసి వెతికినట్లు నటించి తనపై అనుమానం రాకుండా చూసుకుంది. నిర్మానుష్య ప్రదేశంలోని డోలి మృతదేహం ఉన్న ప్రాంతంలో కొంత కాలంగా వెంచర్ నిర్వాహకులు భారీగా మట్టిని పోగు చేస్తున్నారు. లారీల్లో వేరే చోట నుంచి తెచ్చిన మట్టిని పోస్తున్నారు. ఈ మట్టి కుప్పల కింద మృతదేహం కూరుకుపోవడంతో ఎవరికీ కనిపించలేదు.

మృతురాలి కుమారుడికి సందేహం రావడంతో..

రెండు రోజుల క్రితం మృతురాలి పెద్ద కుమారుడు తండా నుంచి సాతంరాయిలోని నానమ్మ తులసి వద్దకు వచ్చాడు. కోడలిని హత్య చేసిన భయంతో ఉన్న తులసి.. మనవడితో మాట్లాడిన తీరు అనుమానాలను రేకెత్తించింది. దీంతో అతను తండాకు వచ్చి తన మేనమామ హరికి విషయం చెప్పాడు. కుటుంబ సభ్యులు సాతంరాయిలో తులసి వద్దకు వెళ్లి మృతురాలి చిన్న కొడుకు మనోహర్‌తో మాట్లాడారు. తన తల్లి ఇక్కడికి వచ్చిన విషయం ఎవరికి చెప్పవద్దని.. లేదంటే చంపేస్తానని నాన్నమ్మ బెదిరించినట్లు చెప్పడంతో.. విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. తులసిని అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో హత్య విషయం వెలుగు చూసింది. దీంతో గురువారం పోలీసులు రాజేంద్రనగర్ ఎమ్మార్వో రాములు పర్యవేక్షణలో ఘటనాస్థలంలో మట్టి దిబ్బల కింద మృతదేహాన్ని వెలికి తీశారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో ఉస్మానియా వైద్యులు అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. డోలి హత్యకు తులసి భర్త అనంతితో పాటు ఇతని సోదరుడు హనుమ సహకరించినట్లు తెలిసింది. హత్యకు గల కారణాలు తెలియరాలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పాత నేరస్తులను పట్టుకోవడం సులువు

- వేలిముద్రల మ్యాచింగ్ ద్వారా గుర్తింపు
- సీఐ సీతారామ్



పాపిలాన్ మిషన్ ద్వారా వేలిముద్రలను పరిశీలిస్తున్న పోలీసులు

కందుకూరు: పాత నేరస్తులు మళ్లీ ఏదైనా నేరం చేస్తే వారిని వేలి ముద్రల సహాయంతో గుర్తించవచ్చని సీఐ సీతారామ్ తెలిపారు. స్థానిక కూడలిలో గురువారం పాపిలాన్ మిషన్ యంత్రం(ఫింగర్ మ్యాచ్ చేసే మిషన్)సాయంతో వాహనాల తనిఖీ నిర్వహించారు. పలువురి వేలు ముంద్రలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. నేషనల్ క్రైం రికార్డు బ్యూరో ద్వారా కొద్ది రోజులుగా పాపిలాన్ మిషన్‌తో నేరస్థులను పట్టుకునే వెసులుబాటు అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. దీంతో ఒకసారి శిక్ష అనుభవించిన వారి వేలిముద్రలను కంప్యూటరీకరించడంతో దేశంలో ఎక్కడైనా ఏదైనా నేరం చేస్తే అనుమానితులుగా ఉన్నప్పుడు యంత్రం సహాయంతో నిందితులను పట్టుకోవచ్చునని పేర్కొన్నారు. రద్దీ ప్రదేశాలు, వాహనాల తనిఖీ, గ్రామాల్లో పెట్రోలింగ్ చేసే సమయాల్లో అనుమానితులుగా ఎవరినైనా కనిపిస్తే.. వారి వేలిముద్రల మ్యాచ్‌ను పరిశీలించి, నిందితుల ఆచూకీ తెలుసుకోవచ్చునని వెల్లడించారు. గంజాయి విక్రయాలు, స్మగ్లింగ్, దొంగతనాలు, లూటి, హత్యలు చేసి గతంలో అరెస్టు అయినవారి వేలిముద్రలు పాపిలాన్ మిషన్‌లో నిక్షిప్తమై ఉంటాయని, దీంతో అలాంటి వారు మళ్లీ తారసపడితే ఇక్కడికి ఎందుకు వచ్చాడు? ఏం చేశాడు అనే కోణంలో విచారించవచ్చునని వివరించారు.